నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
శుక్రవారం 17 అక్టోబర్ 2025 పేజీలు 8



## అంబాపురంలో
# కంపు.. కంపు

అంబాపురం పంచాయితీ పరిధిలో రోజురోజుకీ దుర్గంధం వెదజల్లుతోంది. కాల్వల్లో పూడిక తీత లేక గ్రామవాసులు అల్లాడిపోతున్నారు. పంచాయితీ సెక్రటరీ దృష్టికీ తీసుకెళ్ళినా చూసీ చూడనట్లు వదిలేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. శానిటేషన్ కాంట్రాక్టర్ వద్ద సిబ్బంది లేకపోవడంతోనే గ్రామంలోని శానిటేషన్ ను గాలికొదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా కాల్వల్లో పూడిక తీత లేకపోవడం దోమల వ్యాప్తితో అంబాపురం గ్రామస్థులు విషజ్వరాలతో వణికిపోతున్నారు.




- కాల్వల్లో పూడిక తీత లేక వెదజల్లుతున్న దుర్గంధం
- పంచాయితీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్ళినా నో యాక్షన్
- కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయ్యారంటూ ఆరోపణలు
- శానిటేషన్‌లో 30 మందికి గాను...కేవలం పదిమంది మాత్రమే విధులంటూ ప్రచారం
- 20 మంది లేకున్నా ప్రతి నెలా బిల్లులు చెల్లింపులు
- అభివృద్ధి చెందిన గ్రామంలో వింతైన పోకడ

**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** రోజు కాదు రెండు రోజులు కాదు పదకొండు రోజులు పైగానే కాల్వల్లో ఎక్కడికక్కడ పేరుకుపోయిన మురుగునీరు. దాని నుంచి వస్తున్న దుర్వాసన..డ్రైనేజి సిస్టం కూడా అస్తవ్యస్థంగా

2 లో

### ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ...
# విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దండి
### ప్రయోగాత్మకంగా భౌతిక శాస్త్రాన్ని సులభ పద్ధతులతో అందించండి : కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ




**పామర్రు మేజర్ న్యూస్:** చిన్నచిన్న పరికరాలతో ప్రయోగాత్మకంగా భౌతిక శాస్త్రాన్ని అర్థమయ్యే రీతిలో వివరించే సులభ పద్ధతులను అవలంబించడంతో పాటు ప్రస్తుతం నడుస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన పామర్రు లోని ప్రగతి విద్యాసంస్థలో విద్యాశాఖ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు క్వాంటం కంప్యూటర్స్ పై ఏర్పాటుచేసిన ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి, సరస్వతీ దేవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు న్యూటన్ గమన సూత్రాలు వంటివి కేవలం మాటలలో చెప్పడమే కాకుండా చేతలలో అర్థమయ్యే విధంగా భౌతికంగా చూపిస్తే గుర్తుంటుందన్నారు. నిజజీవితంలో కూడా భౌతిక శాస్త్రం మనకు ఏ విధంగా అన్వయించుకోవచ్చు తెలియజేస్తే విద్యార్థుల్లో చైతన్యం నింపుతుందన్నారు. తద్వారా విద్యార్థులు రాబోయే రోజుల్లో మరిన్ని ఆవిష్కరణలకు నాంది పలుకుతారన్నారు. మనం తరగతులు నిర్వహిస్తే విద్యార్థులు బాగా అర్థం చేసుకొనగలరు అనే నమ్మకం ఉపాధ్యాయులకు ఉండాలన్నారు. ఆంగ్ల భాషలో పట్టు సంపాదిస్తే కంప్యూటర్ తో పాటు అన్ని రంగాలలో సామర్థ్యం పెంచుకునే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో తొలుత ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

మిగతా 2లో...



### జీఎస్టీ సంస్కరణలతో
# సుస్థిర ఆర్థిక ప్రగతి

**స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి జీఎస్టీ 2.0 చేయూత**

**రవాణా, ఆతిథ్య రంగాలకు కొత్త ఉత్తేజం**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 16, మేజర్ న్యూస్ :** జీఎస్టీ 2.0 సంస్కరణలతో దేశ వ్యాప్తంగా 99 శాతం వస్తువులు, సేవలు పన్ను రహితం కావడం లేదా సున్నా శాతం, 5 శాతం, లేదా 18 శాతం జీఎస్టీ పరిధిలోకి వచ్చాయని.. ఈ సంస్కరణలు సుస్థిర ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం, ది కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ భాగస్వామ్యంతో

మిగతా 7లో

# అంబాపురంలో కంపు.. కంపు












(మొదటిపేజీ తరువాయి)

మారింది. వెరసి అంబాపురం గ్రామస్థులు నరకం చూస్తున్నారు. ఇటీవల విష జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ క్యూ కట్టిన గ్రామస్థులు మరోసారి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. తాజాగా అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నపట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామస్థులు పంచాయితీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్ళినా కాంట్రాక్టర్ కు చెప్పి పనిచేపించడంలో విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు అంబాపురం పంచాయితీలో కింది స్థాయి అధికారులతో పనిచేపించుకోవడంలోనూ పంచాయితీ సెక్రటరీ అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు శానిటేషన్ కాంట్రాక్టర్ వద్ద 30 మంది ఉన్నారని వారితో ప్రతి రోజు పనిచేపిస్తున్నానని మచ్చర్లు వేపించి ప్రతి నెలా బిల్లులు పెడుతున్నారు. అయితే వాటికి సర్పంచ్ తో పాటు పంచాయితీ సెక్రటరీతో కూడిన వార్డు మెంబర్లు కమిటీతో ఆమోదం చేపించి బిల్లులు ప్రతి నెలా తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే గ్రామంలోని కాల్వల్లో పేరుకు పోయిన మురుగుతీసినా తీయకపోయినా పట్టించుకోకపోవడం కొసమెరుపు. వార్డు మెంబర్లైతే వాళ్ళ వార్డుల్లో పరిస్థితి అధ్వాన్నంగా ఉన్న బిల్లులకు ఓకె చెప్పడం చర్చనీయాంశంగా మారింది. చూడాలి ఇప్పటికైనా పంచాయితీ సెక్రటరీ మొద్దు నిద్ర వీడి కాంట్రాక్టర్ తో సిబ్బందిని నియమించి గ్రామంలోని పారిశుధ్యం పై దృష్టి పెడతారా లేక చూసీ చూడనట్లు వదిలేస్తారా అనేది.

# ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దండి






(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించామన్నారు. తదుపరి ప్రధానోపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించామన్నారు. లిటిల్ ఎక్స్పరిమెంట్స్ పేరుతో చిన్న తరహా ప్రయోగాలతో భౌతిక శాస్త్రాన్ని అవపోషణ పట్టి సులభంగా అర్థం చేసుకునే రీతిలో వివరిస్తున్న నిపుణులు విశ్రాంత ఉపాధ్యాయులు బి.శివ నాగేశ్వరరావుతో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు వారి జీవిత మార్గదర్శనం తెలియాల్సి ఉందన్నారు. అది ఒక ఉపాధ్యాయుల ద్వారానే చేతనవుతుందన్నారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు యోగా చేయాలన్నారు. విద్యార్థులను కూడా ఆ దిశగా దృష్టి మరల్చేలా చేయాలన్నారు. భవిష్యత్తులో డాక్టర్లకు పెట్టే ఖర్చులు తగ్గుతాయన్నారు. మొదట్లో సమాచారం సాంకేతిక పరిజ్ఞానం పై చాలామందికి అవగాహన ఉండేది కాదన్నారు. నేడు ప్రపంచమంతా దాని చుట్టూ పరిభ్రమిస్తుందన్నారు. మన చుట్టూ ఎక్కడ ఏమి జరుగుతున్నా ఆసక్తి చూపితే తెలుసుకోవచ్చన్నారు. నేడు క్వాంటం కంప్యూటింగ్ అనే కొత్త సాంకేతిక పరిశోధన వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులందరూ క్వాంటం కంప్యూటర్ అవగాహన పెంపొందించుకొని విద్యార్థులకు వివరించి జ్ఞానవంతులను చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నారన్నారు. క్వాంటం కంప్యూటర్లో తొలి నుంచే జిల్లా ముందుకు వస్తే పెద్ద స్థాయిలో భవిష్యత్తులో ఎదగగలుగుతారన్నారు. శుక్రవారం నుండే ఉపాధ్యాయులందరిలో మార్పు రావాలన్నారు. ముందు నుంచి ఉన్న ఉపాధ్యాయులతో పాటు ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా కొత్తగా చేరిన ఉపాధ్యాయులు మొదటి నుండి వారి తరగతులను నూతన విధానంలో విద్యార్థులకు తెలియజేస్తే చాలా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈసారి కార్యశాలలో మనకు అందుబాటులో ఉన్న వస్తువులను ఉపాధ్యాయులందరికీ అందజేస్తామని వాటితో భౌతిక శాస్త్రానికి సంబంధించిన వివిధ అంశాలతో కూడిన చిన్న చిన్న నమూనా ప్రయోగాల పరికరాలుగా మలుచుకునే విధంగా తయారు చేయాలన్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుని వద్ద అటువంటి పరికరాల కిట్టు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఇటువంటి నూతన విధానాన్ని అవలంబిస్తే రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర తరగతిని వదులుకోకుండా ఎంతో ఆసక్తితో హాజరయ్యే పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్ర సమాచార సాంకేతిక ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్ ఈ కార్యక్రమంలో విజయవాడ నుండి వర్చువల్ గా పాల్గొని క్వాంటం కంప్యూటింగ్ గురించి కూలంకుషంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో క్వాంటం కంప్యూటింగ్ కు మంచి భవిష్యత్తు ఉందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు భౌతిక శాస్త్ర నిపుణులు బి.శివ నాగేశ్వరరావు 30 రకాల ప్రయోగాత్మక పరికరాలతో భౌతిక శాస్త్రాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తరగతి గదికే పరిమితం చేయకుండా వారికి చూపించగలిగితే అర్థమవుతుందన్నారు. మనకు ఇంటిలో గాని బయట గాని ఎక్కడైనా వాడి పడేసే చిన్న చిన్న వస్తువులు కూడా ప్రయోగాత్మకంగా మలుచుకునేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సృష్టి భ్రమ తరంగాలు




కాగితాల్లో చెలిరోజు విమానాలు ఎగిరే విధానము, సంపీడనాలు, అనురాగము, అనునాదము విజయ జీవితం లో నిజజీవితంలో ఎలా ఉంటున్నాయో విశదీకరించారు. సాంకేతిక నిపుణులు సాయిచరణ్ క్వాంటం కంప్యూటర్స్ పై ఉపాధ్యాయులకు నేరుగా సోదాహరణంగా అవగాహన కలిగించారు. ఆఫ్ కాస్ట్ సమన్వయకర్త ఎం.శ్రీనివాసరావు భౌతిక శాస్త్రం, బ్లూ ప్రింట్, విశ్లేషణ తదితర అంశాలపై విశదంగా వివరించారు. జిల్లా విద్యాధికారి పి.వి.జె రామారావు మాట్లాడుతూ జిల్లాలో మంచి విద్యా వ్యవస్థ రూపుదిద్దుకోవాలనే తలంపుతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేకించి శిక్షణ తరగతులు స్ఫూర్తిదాయకంగా నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం 10వ తరగతిలో భౌతిక శాస్త్రంలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించిన 24 మంది ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. తదుపరి సాంకేతిక నిపుణులు సాయి చరణ్, దినేష్ లను జిల్లా కలెక్టర్ శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అలాగే స్ఫూర్తిదాయకంగా తరగతులు నిర్వహించిన జిల్లా కలెక్టర్ ను జిల్లా విద్యాధికారి, ఉపాధ్యాయులు అందరూ కలిసికట్టుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, జిల్లా విద్యాధికారి పి.విజయ రామారావు, ఉప విద్యాధికారి పద్మ రాణి, ప్రగతి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ సనకా పూర్ణచంద్రరావు, ఆయన సతీమణి నాగమల్లేశ్వరి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన డీకన్ స్ట్రక్ట్

**డెర్మటాలజిస్ట్‌లతో కలిసి 'ది లాంగెస్ట్ స్కిన్‌కేర్ లైవ్ స్ట్రీమ్' చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సృష్టించిన డీకన్ స్ట్రక్ట్**





**విజయవాడ మేజర్ న్యూస్ :** హైలీ ఎఫెక్టివ్, యెట్ జెంటిల్' ఫిలాసఫీ గా ప్రముఖ చర్మ సంరక్షణా సంస్థ డీకన్‌స్ట్రక్ట్ స్కిన్‌కేర్ అధికారికంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్‌ను బద్దలు కొట్టింది. ఈ మేరకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సీనియర్ అడ్జుడికేటర్ స్వాప్నిల్ దంగారికర్ చేతుల మీదుగా డీకన్‌స్ట్రక్ట్ స్కిన్‌కేర్ వ్యవస్థాపకురాలు మాలిని అడపురెడ్డి సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మాలిని మాట్లాడుతూ 24 గంటల డెర్మథాన్ ద్వారా 'ది లాంగెస్ట్ స్కిన్‌కేర్ లైవ్‌స్ట్రీమ్' కోసం కొత్త టైటిల్ ను సెట్ చేసిందని చెప్పారు. మారథాన్ యూట్యూబ్ లైవ్ సెషన్ లో 24 మంది చర్మవ్యాధి నిపుణులు పాల్గొన్నారని, దేశవ్యాప్తంగా 30,000 మంది పాల్గొన్నారన్నారు. ఈ లాంగ్ మారథాన్ 500,000 కంటే ఎక్కువ రియల్ టైమ్ ఇంటరాక్షన్‌లను సృష్టించిందని, వీటిలో 200,000 చర్మ సంరక్షణ ప్రశ్నలు ఉన్నాయి. 10,000 మందికి ప్రత్యక్షంగా సమాధానాలు ఇవ్వబడ్డాయన్నారు. 24 గంటల ప్రత్యక్ష ప్రసారం విజయవంతంగా పూర్తయిన తర్వాత ఈ రికార్డును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ (టీఎం) అధికారికంగా గుర్తించిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్నటువంటి చర్మ సంరక్షణ నిపుణులు 24 గంటల పాటు, డాక్టర్ అనుప్రియ గోయెల్, డాక్టర్ నేహా సోలంకి, డాక్టర్ ఆదిత్య వాలింగ్కర్, డాక్టర్ రాధిక త్రివేది, డాక్టర్ దేవేంద్ర, డాక్టర్ రాశి సోని, డాక్టర్ విదేహి వంటి వారు మొటిమలు, పిగ్మెంటేషన్, సన్ ప్రొటెక్షన్, పదార్థాలపై అవగాహన, బిగినర్స్ రొటీన్ బిల్డింగ్ వంటి విస్తృత శ్రేణి చర్మ సంరక్షణ సమస్యలను పరిష్కరించారన్నారు. వీక్షకులు యూట్యూబ్ లైవ్ చాట్ ద్వారా రియల్ టైమ్ లో నిపుణులతో సంభాషించారన్నారు. "గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టీఎం టైటిల్ కారణంగానే కాకుండా, దేశవ్యాప్తంగా తాము చూసిన అపూర్వమైన భాగస్వామ్యం కారణంగా డెర్మథాన్ ఒక అద్భుతమైన విజయంగా భావించవచ్చు అన్నారు. డెర్మటాలజిస్ట్ లు కష్టమైన స్కిన్ కేర్ ను ప్రతీ ఒక్కరికీ అర్థమయ్యేలా, ఆచరణీయంగా మార్చడంలో కీలక పాత్ర పోషించారని, ఈ నిపుణులు తమకున్న పరిజ్ఞానంతో రోజువారీ సమస్యలు, వారికున్న సందేహాలను నివృత్తి చేశారన్నారు.

# కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత






**250మందికి దుస్తువుల అందజేత**

**ఉద్యోగుల మేలు చేయడమే లక్ష్యం**

**సాయి శానిటేషన్ సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ అధ్యక్షులు పంచానంద్**

**విజయవాడ మేజర్ న్యూస్ :** కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, వారికి నిరంతరం అండగా ఉంటామని సాయి శానిటేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పంచానంద్ అన్నారు. స్థానిక బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి శానిటేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌లో పని చేస్తున్న కార్మికులకు,ఉద్యోగులకు,పెదలైన వారికి కలిపి సుమారు 250మందికి పైగా నూతనంగా వస్త్రాలను సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దీపావళి సందర్భంగా అందరికి మేలు జరగాలని,ప్రతికుటుంబంలో కాంతులు ప్రతి వెల్లు విరావాలని అకాంక్షించారు.అధ్యక్షులు పంచానంద్ మాట్లాడుతూ విజయ వాడలో పని చేస్తున్న వారికే కాకుండా నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం, హైదరాబాదు తదిత ప్రాంతాల్లో పని చేస్తున్న తమ సంస్థ ఉద్యోగులకు నూతన దుస్తులు అందజేస్తున్నామని, కార్మికులకు మేలు చేయడంతో వారి సంక్షేమాని అన్ని విధాల కృషి చేస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ మున్నిదేవి, కమీటీ సభ్యులు రేఖ దేవి,నిర్వహకులు టి.వెంకటశ్రీను, దీపక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ 2.0 సంస్కరణలు సామాన్యుల పాలిటవరం



**జి కొండూరు మేజర్ న్యూస్ :** జీఎస్టీ 2.0 సంస్కరణలు సామాన్యుల పాలిట వరంగా మారాయని ఎన్డీఏ కూటమి నేతలు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో జీఎస్టీ తగ్గింపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కూటమి నాయకులు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, గొల్లపూడి ఏ.ఎం.సి చైర్మన్ నర్రా వాసు, టీడీపీ నేత, గ్రామ పార్టీ అధ్యక్షుడు నూతులపాటి వెంకటేశ్వరరావు (నారద) తదితరులు మాట్లాడుతూ సరళీకృత, పారదర్శక పన్ను వ్యవస్థ ఫలితంగా వస్తువుల ధరలు తగ్గి, 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు పెద్ద ఎత్తున మద్దతు లభించే అవకాశం ఉందన్నారు.జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి 3 వేల రూపాయల నిత్యావసర సరుకుల కొనుగోలుపై 250 వరకు ఆదా అవుతోంది.పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, కేంద్రంలో ప్రధాని మోడి, రాష్టంలో సీఎం చంద్రబాబు నాయుడు జనరంజక పాలన అందిస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గి ప్రతి ఇంటి ముఖంలో ఆనందం కనిపిస్తోంది. గతంలో నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీని నేడు రెండు స్లాబులకు తీసుకువచ్చినందుకు ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర సరుకులలో 47% వస్తువులను జీఎస్టీ నుంచి మినహాయించారు. దీంతో 3 వేల రూపాయల సరుకులు కొంటే 250 రూపాయల వరకు ఆదా అవుతోందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి జీఎస్టీ ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడికి, సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు అని అన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు ఒకవైపు, సూపర్ సిక్స్ వంటి సంక్షేమ పథకాలు మరోవైపు సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏ.ఎం.సి చైర్మన్ జాలిపర్తి గోపాలకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి వడ్లమూడి చలపతిరావు, ఆర్.టి.ఓ ఇన్ స్పెక్టర్ రమణ, ప్రసాద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## సోనీ నుంచి డబ్ల్యూహెచ్-1000ఎక్స్ఎం6 వైర్‌లెస్ నాయిస్ క్యాన్సిలింగ్ హెడ్‌ఫోన్‌లు

**విజయవాడ మేజర్ న్యూస్ :** సోనీ ఇండియా, డబ్ల్యూహెచ్-1000ఎక్స్ఎం6 వైర్‌లెస్ నాయిస్ క్యాన్సిలింగ్ హెడ్‌ఫోన్‌లను విడుదల చేసినట్లు వెల్లడించింది. ప్రీమియం ఆడియో, వ్యక్తిగత శ్రవణ అనుభవాల కోసం నూతన ప్రమాణాలను నిర్దేశించిన అవార్డు గెలుచుకున్న 1000ఎక్స్ సిరీస్ తాజా ఎడిషన్ ఇది. 1000ఎక్స్ సిరీస్ వారసత్వంపై నిర్మించబడిన ఈ తాజా మోడల్, ప్రీమియం సౌండ్‌ను ఉత్తమ నాయిస్ క్యాన్సిలింగ్‌తో కలిపి, సంగీత ప్రియులు, ఫ్యాషన్ ప్రియులు, ప్రయాణికులు, నిపుణుల కోసం అసమానమైన ఆడియో పరిష్కారాలను సృష్టించడానికి సౌకర్యవంతమైన డిజైన్‌లో తీర్చిదిద్దబడింది. అధునాతన ప్రాసెసర్, అడాప్టివ్ మైక్రోఫోన్ సిస్టమ్ తో శక్తివంతమైనప్పటికీ, డబ్ల్యూహెచ్-1000ఎక్స్ఎం6లో నాయిస్ క్యాన్సిలింగ్ రియల్ టైమ్‌లో మెరుగుపరచబడింది.

## గ్లోబల్ బ్రాండ్స్‌లో శాంసంగ్ ఎలక్ట్రానిక్స్‌కు 5వ ర్యాంక్

INTERBRAND
BEST GLOBAL
BRANDS 2025

**విజయవాడ మేజర్ న్యూస్ :** గ్లోబల్ బ్రాండ్ కన్సల్టెన్సీ ఇంటర్‌బ్రాండ్ ప్రకటించిన 'బెస్ట్ గ్లోబల్ బ్రాండ్స్' జాబితాలో తమకు 5వ ర్యాంక్ లభించినట్లు శాంసంగ్ వెల్లడించింది. వరుసగా ఆరో ఏడాది కూడా ఇదే స్థానాన్ని నిలబెట్టుకోవడం గమనార్హం. ఈ సంవత్సరం జాబితాలో, శాంసంగ్ 90.5 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువను నమోదు చేసింది. 2020 నుండి ప్రపంచ టాప్-5లో స్థానం నిలబెట్టుకున్న ఏకైక ఆసియా కంపెనీగా శాంసంగ్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఇంటర్‌బ్రాండ్ ప్రకారం, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ సానుకూల మూల్యాంకనానికి కంపెనీ అన్ని వ్యాపార విభాగాల్లో ఏఐ పోటీతత్వాన్ని బలోపేతం చేసుకోవడం, ఉత్పత్తుల మధ్య ఏకీకరణ ద్వారా వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడం, ఏఐ సంబంధిత సెమీ కండక్టర్లపై ప్రత్యేకంగా పెట్టుబడులు పెట్టడం. వినియోగదారు కేంద్రీకృత బ్రాండ్ వ్యూహాన్ని అమలు చేయడం వంటి అంశాలు దోహదపడ్డాయి.

## క్విక్ కామర్స్‌తో చివరి నిమిషంలో సులభమైన గిఫ్ట్స్, హోస్టింగ్

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఇల్లు శుభ్రం చేసుకోవడం, ఇన్బాక్స్ క్లియర్ చేసుకోవడం, గెట్-టుగెదర్‌లు ప్లాన్ చేయడం, కుటుంబాన్ని హోస్ట్ చేయడం.. ఇలా దీపావళికి ముందు రోజులు చాలా బిజీగా ఉంటాం. ఈ హడావిడి మధ్య, క్విక్ కామర్స్ పెద్ద తోడ్పాటునందిస్తూ, దీపావళి వేడుకలను మరింత సులభంగా, ఒత్తిడి లేకుండా మారుస్తోంది. ట్రైన్ ఎక్కే ముందు కొనే ఆఖరి నిమిషం గిఫ్ట్ అయినా, అనుకోకుండా వచ్చిన అతిథుల కోసం స్వీట్ అయినా... ఇక్కడ కొన్ని ఆలోచనాత్మకమైన, పండుగ వాతావరణాన్ని పెంచే ఎంపికలు ఉన్నాయి. ఇవన్నీ కేవలం నిమిషాల్లో అందుబాటులో ఉంటాయి. ఖచ్చితంగా ఆనందాన్ని పంచుతాయి. కాబట్టి, ఈ పండుగ సీజన్‌లో, మీ చివరి నిమిషాన్ని సరైన సమయంగా మార్చుకోండి. క్విక్ కామర్స్ సహాయంతో మీరు కేవలం ఒక బహుమతితో కాకుండా, మరింత ఆనందాన్ని, దీపావళి స్ఫూర్తిని కూడా తీసుకువస్తారు.

## టీడీపీ మండల అధ్యక్షులుగా కోనపురెడ్డి వీరబాబు



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** బంటుమిల్లి మండలం మండల టీడీపీ అధ్యక్షులుగా కోనపురెడ్డి వీరబాబును అధిష్టానం నియమించింది. మండల టీడీపీ అధ్యక్షులుగా కోనపురెడ్డి వీరబాబు, కార్యదర్శిగా బొర్రా కాశీ లను టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు అధ్యక్షతన ఎన్నిక అయ్యారు. ఈ సందర్బంగా కూనపురెడ్డి వీరబాబు, బొర్రా కాశీ మాట్లాడుతూ తమ విజయానికి సహకారం అందించిన మండల టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, స్థానిక శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ కు, మాజీ ఎంపీ, ఏపీ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ కు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు కు కృతజ్ఞతలు తెలుపుతూ 2029 లో టీడీపీ నియోజకవర్గం లోనే భారీ మెజార్టీ సాధించేది బంటుమిల్లి మండలంలోనే అని అందుకు తగ్గ పనులు యిప్పటికే ఆచరణలో పెట్టామని మరింత చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని తెలుగు తమ్ముళ్లకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

## లంకిశెట్టికి శుభాకాంక్షలు తెలిపిన జనసేన నాయకులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బుధవారం ప్రముఖ న్యాయవాది మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ షిరిడి నుంచి రావడంతో జనసేన నాయకులు ఉల్లిపాలెం జనసేన పార్టీ ఇంచార్జీ తోట రాజేష్, కాకర్ల మోడీ జనసేన ఇంచార్జ్ నరసింహస్వామి, బి.ప్రభు, షిరిడీలో శ్రీ సాయిబాబా సన్నిధిన పుట్టినరోజు జరుపుకున్న,లంకిశెట్టి బాలాజీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వధువు వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి పేర్ని నాని



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం రూరల్ మండలంలోని తాళ్ల పాలెం పంచాయతీ పరిధిలోని యడ్లవానిపాలెం గ్రామంలోని యడ్ల శ్రీనివాసరావు కుమార్తె వివాహానికి హాజరై వధువు వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని నాని ఈ కార్యక్రమంలో మట్టా నాంచారయ్య, గడిదేసు బలయేసు వైఎస్ఆర్సీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్సిటీలో జిఎస్‌టి అవగాహన సదస్సు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తేనే ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతాయని, అంతిమంగా మనం చెల్లించే పన్నులే అభివృద్ధికి దోహదపడతాయని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. గురువారం మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో సూపర్ జి ఎస్ టి సూపర్ సేవింగ్స్ పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన



ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జి ఎస్ టి పన్నులను నాలుగు స్లాబుల నుండి రెండు స్లాబులకు కుదించడం గొప్ప సంస్కరణ అని అన్నారు. అయితే విద్యాసంస్థలను దృష్టి లో పెట్టుకొని కొన్ని వెసులబాట్లు ఉంటే బావుంటుందని అశాభావం వ్యక్తం చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ట్యాక్సెస్ స్వరూప రాణి సోదాహరణంగా జి ఎస్ టి పై అవగాహన కల్పించి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. మేనేజ్మెంట్ విభాగాధిపతి డా ఎం. శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఆచార్య మారుతి, ఆచార్య దిలీప్, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర పథకాలపై ఎస్సీ యువతకు అవగాహన



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా మచిలీపట్నంలో భారత ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఎస్సీ యువతకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్,ఎస్సీ కార్పొరేషన్, ప్రాజెక్ట్ డైరెక్టర్, డిఆర్డిఏ, డిప్యూటీ డైరెక్టర్, పరిశ్రమలు,అసిస్టెంట్ డైరెక్టర్, ఫిషరీస్,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్డిఎం, బ్యాంక్ ప్రతినిధులు, వైస్ చైర్మన్, మచిలీపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్,డిసిఎంసి సభ్యులు, ఎన్జీవోలు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారు పథకాల అమలు ద్వారా ఎలా లబ్ధి చేకూరతయో వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

# కెయూ ఇంజనీరింగ్ క్యాంపస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాలలో కొత్తగా వచ్చిన విద్యార్థులకు ఆహ్వానం పలికే వేదిక ఫ్రెషర్స్‌డే నూతన ఉత్సాహంతో ఆహ్లాదకర వాతావరణంలో వేడుకలా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే రాంజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన, అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు వికాసం కూడా తప్పనిసరి అన్నారు. సాంకేతికత అందిపుచ్చుకోవడంలో వయసుతో సంబంధం లేకుండా ముందుండాలనీ, కాలంతో పోటీపడి మనల్ని మనం ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని విద్యార్థులకు సూచించారు. రెక్టార్ ఆచార్య ఎంవి బసవేశ్వర రావు మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే యొక్క జోష్ మిమ్మల్ని చూస్తుంటే కనిపిస్తుందని, విద్యార్థి అనే వాడు కావలసినంత అల్లరి చేయవచ్చు కానీ ఈ నాలుగు సంవత్సరాలు ఇంజనీరింగ్ సరిగా చదువుకొని ఉద్యోగం తెచ్చుకున్నప్పుడు మాత్రమే జీవితానికి నిండుతనం వస్తుందని, కుటుంబానికి చేయూత అందించిన వారు అవుతారని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన అన్ని వసతులను ఎప్పటికప్పుడు కాలానుగుణంగా ఏర్పాటు చేస్తున్నామనీ, మీరు చేయవలసిందిగా వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని అభిలాషించారు. ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకె సుందర కృష్ణ మాట్లాడుతూ ఇప్పటినుండే పరిశోధన పై దృష్టి సారిస్తే ఆఖరి సంవత్సరం వచ్చేసరికి ఉద్యోగం సాధించడం సులభతరం అవుతుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా. ఆర్ విజయ కుమారి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థి అనే ట్యాగ్ మిమ్మల్ని సమాజంలో ఉన్నతంగా నిలబెడుతుందని, దానికి తగినట్టుగానే మీ నడవడిక, ఆలోచన ధోరణిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్యాంపస్ లోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాల శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు... అంతిమంగా క్యాంపస్ నుండి చదువు ముగించుకుని బయటకు వెళ్లే ప్రతి ఒక్క విద్యార్థి భవిష్యత్తు బాగుండాలని అభిలాషించారు... తదుపరి విద్యార్థుల కేరింతలతో ఆటపాటలతో గ్రూప్ డాన్స్‌ల కోలాహలంతో ఆడిటోరియం అంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



## అబ్దుల్ అజీజ్‌ను సత్కరించిన మైనార్టీ నాయకులు

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పత్తేలంక గ్రామంలో ముస్లిం మైనార్టీ పామర్రు నియోజకవర్గ అధ్యక్షులుగా నియమితులైన అబ్దుల్ అజీజ్‌ను ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు గౌరవించి సత్కరించారు. పామర్రు మాజీ శాసనసభ్యులు అనిల్ కుమార్ ఆదేశాల మేరకు నియమితులైన అజీజ్‌ను గ్రామ సర్పంచ్ హిదయతుల్లా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. రాబోయే కాలంలో వైఎస్సార్సీపీని బలోపేతం చేయాలని కోరుతూ ఈ సందర్భంగా మైనార్టీ కమిటీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ, అమీనపురం, పత్తేలంక గ్రామాల అబ్జర్వర్ కొడమంచిలి మహేష్, ఉప సర్పంచ్ సత్తారి, మహమ్మద్ రఫీ, సుభాని, సయ్యద్ ఆలిక్ లాల్ అహ్మద్, వహీబ్ సుభాని, అబ్దుల్ ఖలీల్, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అబాకస్ మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ విజేతలుగా కొమ్మారెడ్డి విద్యార్థులు



**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** కొమ్మారెడ్డి పాఠశాలలో హైదరాబాదుకు చెందిన మెమోరీ మాథ్స్ అకాడమి 1 నుండి 5 తరగతుల విద్యార్థులకు బుధవారం అబాకస్ మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన 62 మంది విద్యార్థులకు తరగతులలోని సెక్షన్ల వారీగా ప్రథమ, ద్వితీయ బహుమతులను గురువారం విద్యార్థులకు స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ అందించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ అబాకస్ ట్రైనింగ్ విద్యార్థులకు మ్యాథ్స్ ను సులువుగా నేర్చుకోవడానికి ఉపయోగపడడమే కాకుండా, గణితం పట్ల భయాన్ని పోగొట్టి విద్యార్థులకు గణితం పై ఆసక్తిని పెంచడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈవిద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ స్కూల్ సెక్రెటరీ, కరెస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ,యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరిణి స్కూల్ హెచ్ఎం ఎన్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

## మండలంలో 9 బాణసంచా దుకాణాలు



**మొవ్వ మేజర్ న్యూస్:** మండలంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు 9 దరఖాస్తులు అందినట్లు తహసిల్దార్ కే మస్తాన్ తెలిపారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో బాణసంచా దుకాణాల ప్రదేశాలను అధికారులు బృందం పరిశీలించారు. అందులో భాగంగా పెదపూడి కూచిపూడి వర్తక సంఘం కళ్యాణ మండపంలో మూడు దుకాణాలు, నిడుమోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు దుకాణాలు, కోసూరు పిఎసిఎస్ ఆవరణలో ఒకటి, కాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటి, మండల కేంద్రమైన మొవ్వ కళ్యాణ మండపంలో ఒకటి, కూచిపూడి రోడ్డులో గల పొలాల్లో ఒకటి, మొత్తం తొమ్మిది బాణసంచా దుకాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు తహసిల్దార్ తెలిపారు. స్థల పరిశీలన అధికారులు బృందంలో తహసిల్దార్ కే మస్తాన్, కూచిపూడి ఎస్సై కే ఎన్ విశ్వనాథ్, ఎలక్ట్రికల్ ఏఇ రమేష్ బాబు, ఆర్ ఐ విజయదుర్గా, మొవ్వ, పామర్రు అగ్నిమాపకాధికారులు కె. వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల వీఆర్వోలు, బాణసంచా దుకాణదారులు ఉన్నారు.

## జిల్లా స్థాయి పోటీల్లో ఏ కొండూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో ఏ కొండూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో గెలుపొందారు. 9వ తరగతి చదువుతున్న డి మన్విత డ్రాయింగ్ పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయిలో తృతీయ స్థానం టి విగ్నేశ్వరవారి జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీల్లో కన్సోలేషన్ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీజే ఎండి ప్రసాద్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు గురువారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ,డి ఈ ఓ యు వి సుబ్బారావు చేతుల మీదగా మెమెంటో, మెడల్‌తో పాటు నగదు బహుమతి అందించినట్లు తెలిపారు ఈ విద్యార్థులకు ఎంఈఓ కేశవరావు, సర్పంచ్ రజిని, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోపి, ఉపాధ్యాయులు అభినందించారు.

# స్వర్గీయ మండలి విగ్రహానికి నివాళులర్పించిన నాగాయతిప్ప గ్రామస్తుల



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కరకట్టల నిర్మాణంతో దివి తీరానికి రక్షణ కల్పించిన నాయకుడు ఎంపీ కృష్ణారావు అని ఎమ్మెల్యే మండలి తనయుడు వెంకట్రామ్ అన్నారు. గురువారం అవనిగడ్డ వంతెన సెంటరులో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మోపిదేవి మండలం నాగాయతిప్ప గ్రామ కూటమి నాయకులు కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వ్యవసాయ రంగ విస్తరణకు, పరిరక్షణకు కృష్ణారావు విశేష కృషి చేశారన్నారు. దివిసీమలో సముద్ర తీరం వరకు భూముల సేద్యానికి 1977లోనే పులిగడ్డ ఆక్విడెక్టుకు అదనపు తొట్టి నిర్మించి అదనంగా 70 వేల ఎకరాలను సాగులోకి తీసుకువచ్చారన్నారు. విస్తరణకు అనుకూలంగా కాలువలు ఆధునీకరించి రెగ్యులేటర్లు నిర్మించారని తెలిపారు. సాగునీటితో పాటు 45 గ్రామాలకు త్రాగు నీటిని కూడా ఈ ఆక్విడెక్టు ద్వారా సమకూర్చిన ఘనత కృష్ణారావుకే దక్కుతుందన్నారు. ఏటిమొగ - హంసలదీవి దివిసీమ సముద్రపు కరకట్ట, మోపిదేవి వార్పు నుంచి అయోధ్య వరకు కృష్ణానదికి కరకట్ట నిర్మించడం ద్వారా ముంపు నివారణతో పాటు ఆయా గ్రామాలకు రక్షణ, సేద్యపు వనరులు పెంచి సస్యశ్యామలం చేశారన్నారు. ఎదురుమొండి పంపింగ్ స్కీమ్, రిజర్వాయర్ పథకాల ద్వారా సాగు విస్తీర్ణం పెంచారన్నారు. కెనడా వారి సహకారంతో ఎదురుమొండి - ఈలచెట్లదిబ్బ దీవులకు వెస్ట్ బ్యాంక్ కెనాల్ నుంచి కృష్ణా నది గర్భంలో పైప్ లైన్ వేయించి మంచినీరు, సేద్యపు నీరు సప్లైకి రూ.కోటిన్నర ఖర్చుతో పథకాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, మోపిదేవి మండల టీడీపీ, జనసేన అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, పీఏసీఎస్ అధ్యక్షులు యలవర్తి చిన్నా, యర్రంశెట్టి సుబ్బారావు, న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు సిద్దినేని అశోక్ నాయుడు, గుగ్గిలం శ్యాంకుమార్, అన్నపరెడ్డి రామదాసు, బడే సుబ్బారావు, లింగం బాబూరావు, దేగల రాఘవ, బాలు శ్రీనివాస్, బచ్చు ఆదినారాయణ, గ్రామ కూటమి నాయకులు గరికపాటి అమరేశ్వరరావు, నాగబాబు, వీరాంజనేయులు, శ్రీనివాసరావు, మురాల సుబ్బారావు, చిల్లిముంత బాబూరావు, గరికపాటి నాగేశ్వరరావు, కూనపరెడ్డి నవీన్ బాబు, గరికపాటి రామాంజనేయులు, బొల్లిముంత సాయికృష్ణ, గరికపాటి వెంకటేశ్వరరావు, రేపల్లె నాగేంద్రబాబు, గరికపాటి శ్రీనివాసరావు, అనిల్, పుప్పాల పెద్ద ఏసు, ఉప్పాల సురేష్, మైలా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పోలి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన గన్నవరంలో జరిగే కృష్ణాజిల్లా 9వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం స్థానిక గ్రామ పంచాయ తీ కార్యాలయం వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయ తీ కార్మికుల సమస్యల పట్ల ఉద్యోగుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై కార్మికవర్గం పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ గ్రామాభివృద్ధి పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని విమర్శించారు. గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకుండా విధుల నిర్వహణ అధికారులపై తీవ్ర ఒత్తిడితో వారికి పనిభారం పెరిగిందన్నారు.జిల్లాలో 498 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిషియన్స్, గ్రీన్ అంబాసిడర్, వ్యాన్.. ట్రాక్టర్ డ్రైవర్, కంప్యూటర్ ఆపరేటర్స్, బిల్ కలెక్టర్స్, వాచ్మెన్ ఇలా పలురకాల విధులు నిర్వహిస్తూ కాం ట్రాక్ట్, ఎన్ఎంఆర్, పార్ట్ టైం టెండర్ పద్ధతిపై పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు అమలుచేయటం లేదని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న జీవోలు 57, 132, 142, 680లను అమలుచేయటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గన్నవరంలో జరిగే మహాసభకు కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మదర్ కరీమ ఎల్లా, యూనియన్ నాయకులు సొంతల జయలక్ష్మి, కొమ్ముకూరి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జనవాణి జనసేన భరోసా రెండవ రోజు అర్జీలు స్వీకరిస్తున్న బండి రామకృష్ణ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని నేషనల్ కాలేజ్ ప్రక్క చలపాటి కాలని నివాస గృహాలపై నుండి వెళ్లిన11కేవి విద్యుత్ తీగలను తొలగించాలని జనవాణి జనసేన భరోసా కార్యక్రమంలో మచిలీపట్నం ఇంచార్జ్ బండి రామకృష్ణకు బాధితుల పక్షాన వినతి పత్రం అందించిన దేవనూరి వీరబాబు అర్జిని పరిశీలించిన బండి రామకృష్ణ జనవాణి జనసేన భరోసా కార్యక్రమం నుండి మచిలీపట్నం విద్యుత్ అధికారి డిఇతో చరవాణిలో సమస్యను పరిష్కరించాలని కోరారు. దేవనూరి వీరబాబు మాట్లాడుతూ,2015 నుండి సమస్య పరిష్కారం కావడం లేదని కొంతమంది విద్యుత్ తీగల కింద ఇళ్లను నిర్మించుకొని ప్రమాద అంచుల్లో జీవనం సాగిస్తున్నారని సొంత భూముల పై నుండి 11 కెవి, విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారని తొలగించమని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ అధికారులతో మాట్లాడటం జరిగిందని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని బాధితులకు తెలపమని దేవనూరి వీరబాబుకు బండిరామకృష్ణ హామీ ఇచ్చారు.జనవాణి జనసేన భరోసా కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మండల పార్టీ అధ్యక్షులు గల్లాతిమోతి, ఏఎంసి వైస్ చైర్మన్ చిలంకుర్తి పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## సూపర్ జీఎస్టీ అవగాహన ర్యాలీ

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** సూపర్ జీఎస్టీ అమలుతో ద్విచక్ర వాహనాల ధరలు గణనీయంగా తగ్గాయని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం అవనిగడ్డలో రవాణా శాఖ అధికారులు సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వెంకటేశ్వరరావు జండా ఊపి ప్రారంభించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ స్లాబులు సవరించి అన్ని వస్తువులతో పాటు ద్విచక్ర వాహన కొనుగోలు దారులకు సైతం ధరల వెసులుబాటు కల్పించారని, సరుకు రవాణా వాహనాలపై 28% ఉన్న జీఎస్టీ ఇప్పుడు 18 పర్సెంట్ తగ్గించారు, ట్రాక్టర్ల పై 12 శాతం ఉన్న జిఎస్టి 5 శాతం తగ్గించారు బస్సులు మినీ బస్సులపై 28% ఉన్న జీఎస్టీ ఇప్పుడు 18 /పర్సంటేజీ తగ్గించారని, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 12% నుంచి 5% కి తగ్గించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, రవాణా శాఖ అధికారి లోకనాథ ప్రసాద్, టీడీపీ నాయకులు బండే రాఘవ, అశ్వారావుపాలెం మాజీ సర్పంచ్ కొండవీటి మధుసూదనరావు, హోండా, హీరో, బజాజ్, టీవీఎస్, మారుతీ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దార్ కె. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు కార్యక్రమం సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, మార్కెటింగ్ శాఖతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు జరగనున్నట్లు చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఖాతాల ద్వారా నేరుగా చెల్లింపులు అందుకోవాలని సూచించారు. ధాన్యం కొలతలు, నాణ్యత పరీక్ష, రవాణా, నిల్వ వంటి అంశాలపై అధికారుల ద్వారా వివరాలు అందించబడ్డాయి.ఈ సమావేశంలో అవనిగడ్డ కోడూరు నాగాయలంక మండలాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్లు, వ్యవసాయ సిబ్బంది, వీఆర్ఓలు, వీఏఏలు, టీఏలు, డీఈఓలు తదితరులు పాల్గొన్నారు. జియో కోఆర్డినేట్ మ్యాపింగ్, ధాన్యం రిజిస్ట్రేషన్ ప్రక్రియపై కూడా అవగాహన కల్పించారు.

## టీసీఎస్ ఉద్యోగాలకు విజయక్రాంతి విద్యార్థుల అర్హత




**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీ టీసీఎస్ వారు నిర్వహించిన ఉద్యోగ అర్హత పరీక్షల్లో చల్లపల్లి విజయక్రాంతి డిగ్రీ కళాశాల విద్యార్థులు 27 మంది అర్హత సాధించినట్లు ప్రిన్సి పాల్ దుట్టా శివరామప్రసాద్ తెలిపారు. అడపా నవ్యశ్రీ, బొర్రా వైష్ణవి, గోళ్ల వాసవి ప్రజ్ఞ, యార్లగడ్డ హర్షిత ప్రియ, బుర్రే ఐశ్వరయ్య, కమతం అస్మితలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారనీ, 21మంది విద్యార్థులు 60శాతం కంటే అధిక మార్కులు సాధించారన్నారు. ఉద్యోగ అర్హత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్, అధ్యాపకులు ఎంఎన్ఆర్, మత్తి సూర్యప్రసాద్, ఇన్చార్జి కె.సత్యనారాయణలు అభినందించారు.

## రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశాల మేరకు గురువారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని మీటింగ్ హాల్లో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు



డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నగరంలో జరుగుతున్న సర్వే స్థితిగతులను సమీక్షించారు. ఈ సర్వేలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని ఖాళీ స్థలాలు, ఖాళీ స్థలాలుగానే ఉన్నాయా లేదా వాటి పైన ఇల్లు నిర్మించారా, ఒకవేళ ఇళ్లను నిర్మిస్తే వాటికి తగ్గట్టుగా ఖాళీ స్థలాల పన్నును ఇంటి పన్నుకి మార్చాలని, ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్ కు తగ్గట్టుగా ఉందా లేదా, ఒకవేళ అదనముగా రూములు నిర్మించిన, ఫ్లోర్లు నిర్మించిన, ఆ మార్పుకు తగ్గట్టుగా పన్నును ఈ సర్వే ద్వారా మార్చాలని అన్నారు. అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి కచ్చితంగా ఈ సర్వేను పూర్తి చేయాలని అన్నారు. అలాగే ప్రజలు కూడా సిబ్బంది తమ వద్దకు వచ్చినప్పుడు సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, ఏ యూ బి శర్మ, డి.శ్రీనివాస్, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## అక్టోబర్ 17 నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ

విజయవాడ, మేజర్ న్యూస్ : ఈ సంవత్సరపు ఖరీఫ్ సీజన్‌లో ఎన్‌టిఆర్ జిల్లాలో మొత్తం 3,59,733 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా. ఇందులో సుమారు 3,03,154 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 159 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. జిల్లాలోని అన్ని 159 రైతు సేవా కేంద్రాలు అక్టోబర్ 17వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ.. తిరువూరు మండలంలోని మునకుల్ల రైతు సేవా కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు రైతు సేవా కేంద్రాలను వినియోగించుకొని, మద్దతు ధర పొందవలసిందిగా జిల్లా పౌర సరఫరాల శాఖ మ్యానేజర్ టీవీ సతీష్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా నైపుణ్యాలు

**కెరీర్ పరంగా ప్రపంచవ్యాప్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు**

**నైపుణ్యాభివృద్ధి సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 16, మేజర్ న్యూస్ :** ప్రస్తుతం జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా యువత నైపుణ్యాలు సముపార్జించాలని.. అప్పుడే కెరీర్ పరంగా ప్రపంచ వ్యాప్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్–ఎస్‌డీసీ) ద్వారా అందిస్తున్న సేవలకు సంబంధించిన వివరాలను, సంస్థ కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఏపీ ఎస్‌ఎస్‌డీసీ ద్వారా ఎప్పటికప్పుడు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలతో పాటు జాబ్ మేళాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రష్యా, జర్మన్, ఖతార్ తదితర దేశాల్లో కూడా వివిధ ఉద్యోగావకాశాలు పొందేందుకు ఆయా భాషల్లో శిక్షణతో పాటు ఉద్యోగాలు పొందేందుకు చేయూతనందిస్తోందన్నారు. ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ వెంట జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వెంట సీపాన శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు ఉన్నారు.

# రెచ్చిపోతున్న ద్విచక్ర వాహనాల దొంగలు..





**ఆందోళనలో యజమానులు**

**రికవరీలో పోలీసుల అలసత్వం**

**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం లో ద్విచక్ర వాహనాలు చోరీలు సీసీ కెమెరాలు ఉన్నా చోరీలకు అడ్డుకట్ట పడట్లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు నిమిషాల వ్యవధిలో దొంగలించి పారిపోయిన సంఘటన హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.టెక్నాలజీతో నేరాలకు అడ్డుకట్ట వేస్తాం అని నిత్యం భద్రతా సూక్తులు వల్లించే పోలీసు ఉన్నతాధికారులకు ద్విచక్ర వాహనాల దొంగలు సవాలుగా మారారు.వాహనం పోగొట్టుకుని నెలలు గడిచినా, పోలీసుల చుట్టూ తిరిగినా బాధితులకు మాత్రం న్యాయం జరగడంలేదని కొందరు బాధితులు వాపోతున్నారు.షాపుల ఎదుటో, ఆసుపత్రి ఎదుటో, చివరికి ఇంటి ముందు వాహనాన్ని నిలిపి ప్రక్కకు వెళ్లాలన్నా భయపడే స్థితికి వచ్చామని వాహన దారులు తెలుపుతున్నారు.గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించడంతో పాటు ప్రార్ధనా మందిరాలలో, వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించిన పోలీసులకు ద్విచక్రవాహన చోరులు చిట్టడమే లేదు. గతంలో లక్షలాది రూపాయల వ్యయంతో పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్ కుమార్ వితరణ చేసిన సీసీ కెమెరాలు మచ్చుకు కూడా ఎక్కడా కనబట్లేదు. దాత అందించిన సీసీ కెమెరాలు ఉన్నాయా,లేక వాటిని కూడా దొంగ లెత్తుకువెళ్లారో తెలియని పరిస్థితి ఏర్పడింది. హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిదిలో కొన్ని నెలలుగా ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయంటే పోలీస్ సిబ్బంది ఏవిధంగా విధులు నిర్వహిస్తున్నారో అర్ధమవుతుంది.రాత్రి సమయంలో యజమాని ఇంటిలో నిద్రిస్తుండగానే గేటు తాళాలు పగల గొట్టి ఇంటిలోపల గల వాహనాన్ని తీసుకువెళుతున్నారంటే చోరులు ఎంతకు తెగించారో అర్ధం చేసుకోవచ్చు.కొందరు బాధితులు పోలీస్ స్టేషన్కు వెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలు తరబడి స్టేషన్ల చుట్టూ తిరిగిన అదిగో.ఇదిగో దర్యాప్తు చేస్తున్నామని చెప్తున్నారే తప్ప రికవరీ మాత్రం చేయడం లేదు. హనుమాన్ జంక్షన్ విజయవాడ రోడ్డులో గల డ్యూడా రామ్ బస్టాండ్ ఎదురుగా రోడ్లో ఉదయం ఇంటి ముందు ద్విచ క్రవాహనానికి తాళంవేసి లోపలికి వెళ్లాడు. గంట తర్వాత వచ్చి చూసుకుంటే తన వాహనం కనబడలేదు. పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసి నెలలు గడుస్తున్న దర్యాప్తు చేస్తున్నామంటూ చెప్పటం తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.దుకాణాల వద్ద సీసీ కెమెరాల సాయంతో చోరీ జరిగిన తీరు కళ్లకు కట్టినట్లు కనబడినా ఇంత వరకూ రికవరీ లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. బాపులపాడు మండలం ఇందిరానగర్ చెందిన గౌడ్ర రాంబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు.రాత్రి విధులు నిర్వహించుకొని తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి లోపల పార్కు చేసి లోనికి వెళ్లాడు.ఇంటి గేటు తాళం పగలగొట్టి మరీ ద్విచక్రవాహనాన్ని దొంగిలించారు.దీంతో చుట్టు పక్కల ప్రాంతాలు వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఇదే తీరులో నక్క పాండు నగర్ బజా రులోని నివసిస్తున్న పి. ప్రేమ్ కుమార్ ఇంటి ఇంటి బయట తాళం వేసి ఉన్న ద్విచక్ర వాహనం ని చోరీ చేసారంటే పరిస్థితి అర్ధం చేసుకోవచ్చు. ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడం పలు విమర్శలకు తావిస్తోంది. పోలీసులు అధికారులు ఇలాంటి దొంగతనాలపై దృష్టిసా రించి వాహనాల చోరీలను తగ్గించాలని ద్విచక్ర వాహనాల చోరీల దొంగలను పట్టుకుని తమకు తిరిగి బైకును అందించి న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.పోలీసులు చోరీల పై ప్రత్యేక నిఘా పెట్టి బాపులపాడు ప్రాంత ప్రజలను తీవ్రభయాందోళనకు గురిచేస్తున్న బైక్ చోరీల నుండ మెరుగైన పోలీసింగ్ సేవలను అందించి ప్రజలకు శాంతి భద్రతలను కల్పించడంలో ముందు వరుసలో ఉండాలని పలువురు కోరుతున్నారు.

## ఆపదలో ఉన్న వారికి అండగా గద్దె క్రాంతి కుమార్



**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్థానిక 22వ డివిజన్ గంగానమ్మ గుడి ప్రాంతంలో టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ గురువారం ఉదయం పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సిద్దాబత్తుల గోవింద్ ఇంటికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10,000 సొంత నిధుల నుంచి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే, వృద్ధ దంపతులైన సోరగుడి వెంకటేశ్వరరావు–మల్లేశ్వరి దంపతులకు, టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మార్గదర్శకత్వంలో నెల మొత్తానికి సరిపడా 3 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు, చేతి ఖర్చు నిమిత్తం రూ.1,500 ఆర్థిక సహాయాన్ని గద్దె క్రాంతికుమార్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ పేదల కష్టాలు తీర్చడంలో ఉన్న ఆనందం మరొక్క దాంట్లో దొరకదని, మా కుటుంబానికి అనేక సంవత్సరాలనుండి సంప్రదాయంగా మారిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఉన్న పేదలకు తమవంతు అండగా ఉండడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం తన తండ్రి ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఎల్లప్పుడూ ప్రజలతోపాటు ఉంటారని ప్రతి పేద కుటుంబం సంతోషంగా జీవించాలన్నదే సంకల్పంగా సేవా కార్యక్రమాలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు గొర్రిపర్తి నామేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామమోహన్, గద్దె క్రాంతికుమార్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై స్పందిస్తున్నారన్నారు. ఇటువంటి నిబద్ధత గల నాయకులు దొరకడం తూర్పు నియోజకవర్గ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తండ్రి బాటలో నడుస్తూ, తండ్రికి తగ్గ తనయుడిగా గద్దె క్రాంతికుమార్ పేద ప్రజల గుండెల్లో నిలుస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొర్రా అప్పన్న, తోట శ్రీనివాస్, పెద్ది అన్నారావు, నడికొప్పుల శివ, కేశనం బావన్నారాయణ, కొండేటి వెంకట్రావు, యాళ్ల దుర్గారావు, నాగవరపు సురేష్, రవి, పెద్దపల్లి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## అగ్ని ప్రమాద నిరోధక అవగాహన

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి గురువారం ఉదయం గాంధీ నగర్ లో ఉన్న శైలజ థియేటర్ ను ఆకస్మిక తనిఖీ చేసారు వి యం సి సిబ్బంది. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానం, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె. నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



# మున్సిపాలిటీల్లో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంపై విచారణ



**జగ్గయ్యపేట: అక్టోబర్ 16 మేజర్ న్యూస్:** జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలోని శ్రీ రాజా రంగారావు, ఎస్ యు బి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తున్న 32 షాపుల పై ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త డీఎస్పీ సుబ్బారెడ్డి విచారణ జరిపారు. ఈ కాంప్లెక్స్ లో ఉన్న పై షాపుల వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం షాపులను రెన్యువల్ చేసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా గత మూడు మాసాలుగా పురపాలక సంఘం వారు లీజు దారులకు రెన్యువల్ చేయకుండా నిలిపివేయడం జరిగింది. దీనిపై సామాజిక కార్యకర్త జావీద్ అహ్మద్ ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. లోకాయుక్త ఆదేశాలు మేరకు డి.ఎస్.పి రామసుబ్బారెడ్డి గురువారం మున్సిపల్ కార్యాలయంలో షాపులకు సంబంధించిన రికార్డులను పరిశీలన చేయడం జరిగింది. అద్దెలు చెల్లించకుండా అక్రమంగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో విచారణ అధికారిగా వచ్చిన అధికారి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. లీజు గడువు ముగిసిన వెంటనే వేలంపాట నిర్వహించాలని నిబంధన ఉన్నప్పటికీ దానిని పాటించకుండా అక్రమ వ్యాపారులతో చేతులు కలపటాన్ని తప్పు పట్టినట్టు తెలుస్తుంది. 2019 నుండి పురపాలక సంఘంలో జరిగిన లీజు వేలం పాటలు అలాగే రెన్యువల్ విధానాలకు సంబంధించిన పూర్తి రికార్డులు స్వాధీనపరచుకొని అప్పటినుండి ఇప్పటివరకు పని చేసిన అధికారులు అలాగే మున్సిపల్ రెవెన్యూ విభాగం లోని ఉద్యోగుల వివరాలను కూడా తీసుకోవడం జరిగిందని తెలుస్తుంది. ఈ విచారణ సందర్భంగా నలుగురు కమిషనర్లు 8 మంది రెవెన్యూ అధికారులు 10 మంది రెవిన్యూ ఇన్స్పెక్టర్ లపై శాఖాపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సిఫార్సు చేసే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.ప్రస్తుత రెవెన్యూ అధికారి త్రినాధ్ మాత్రం 2025 లో జరగాల్సిన పై షాపుల లీజు రెన్యువల్ విధానం పై ప్రభుత్వ విధానాల ప్రకారం నోటీసులు జారీ చేసి మున్సిపల్ కమిషనర్ కు నివేదికను సమర్పించి లోకాయుక్త విచారణ నుండి బయటపడినట్లు తెలుస్తుంది.

ఈ సందర్భంగా వ్యాపార షాపుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాజేశ్వరరావు. బాబ్జి నాయుడులు స్వయంగా కలిసి తమ వాదన వినిపించారు. అదేవిధంగా ఫిర్యాదుదారుడు జావీద్ అహ్మద్ తో కూడా డిఎస్పి రెడ్డి ఫిర్యాదు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డులన్నింటినీ పరిశీలన చేసి లోకాయుక్తకు సమర్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణారావు, రెవిన్యూ అధికారి త్రినాధులు వారితో పాల్గొన్నారు.

# ఘట్లను పరిశుభ్రంగా ఉంచండి







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఘట్లను పరిశుభ్రంగా ఉంచాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణవేణి ఘాట్, భవాని ఘాట్, పున్నమి ఘాట్, కామకోటి నగర్, తుళ్లూరు వారి వీధి, మాధవ శర్మ వీధి, క్వారీ రోడ్, ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్, సితారా సెంటర్ ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఘట్ల పైన పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, రానున్న భవాని దీక్ష విరమణ కోసం వచ్చే భక్తులకు, ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు కన్వేయర్ బెల్ట్ ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, అవసరమైన చోట మరొక కన్వీర్ బెల్ట్ ను ఏర్పాటు చేసేటట్టు అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పునమిఘాట్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్లో జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిగా పూర్తిచేసి అక్కడున్న నిర్మాణ వ్యర్థాలను ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. తదుపరి వన్ టౌన్ గాంధీజీ మహిళా కళాశాల వద్ద అన్న క్యాంటీన్ ను పరిశీలించి, అన్న క్యాంటీన్లో వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, వారికి కల్పించిన సౌకర్యాలు ఎటువంటి అంతరాయం ఉండరాదని, ఏవైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే పూర్తి స్థాయిలో వాటిని మరమతులు చేసి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, త్రాగునీటి సరఫరా వాడుకనీటి సరఫరాలో ఏమాత్రం అంతరాయం రాకూడదని, అన్న క్యాంటీన్లో వచ్చే ప్రజల అభిప్రాయం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఏవైనా ఇబ్బందులు ఉన్నచో వెంటనే పరిష్కరించాలని, ప్రతిరోజు అధికారులు తమ తమ అన్న క్యాంటీన్ ను పరిశీలించి ప్రజల వద్ద అభిప్రాయాలు సేకరిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో

# ఉద్యోగాల భర్తీ

### ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నడుస్తున్న ఇంటిగ్రేటెడ్ ఛైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ (ఐసీపీఎస్), ఎస్ఏఏ, చిల్డ్రన్ హోమ్స్లో కాంట్రాక్టు లేదా అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అకౌంటెంట్, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, పార్ట్ టైమ్ డాక్టర్, చౌకీదారు కం నైట్ వాచ్ విమెన్, ఎడ్యుకేటర్ పార్ట్ టైం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ టీచర్ పార్ట్ టైం, పీటీ ఇన్స్ట్రక్చర్ కమ్ యోగా టీచర్ పార్ట్ టైం, కుక్, హెల్పర్, హౌస్ కీపర్, హెల్పర్ కమ్ నైట్ వాచ్ విమెన్ పోస్టులకు స్థానిక అర్హులైన 18 - 42 ఏళ్ల వయసున్న మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అయిదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు వయసు సడలింపు ఉంటుందన్నారు. ntr.ap.gov.in నుండి దరఖాస్తులు డౌన్లోడు చేసుకొని పూర్తిచేసిన అన్ని ధ్రువపత్రాల నకళ్లను గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలులోగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి వారి కార్యాలయం, డోర్ నెంబర్ 6-93, కార్మెల్ చర్చి ఎదురురోడ్, కానూరు, విజయవాడ వారి కార్యాలయానికి అభ్యర్థులు స్వయంగా సమర్పించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం తెలిపారు.

## జీఎస్టీ సంస్కరణలతో సుస్థిర ఆర్థిక ప్రగతి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుచేసిన ఆటోలు, సరుకుల రవాణా వంటి వివిధ పనులకు ఉపయోగించే చిన్న వాహనాల ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్, జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్ తదితరులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి జీఎస్టీ 2.0 సంస్కరణలు తోడ్పడతాయని.. రవాణా, ఆతిథ్య రంగాల్లో మరింత అభివృద్ధికి వీలవుతుందన్నారు. ప్రయాణికుల రవాణా వాహనాలు, వస్తువుల రవాణా వాహనాలకు 28 శాతం ఉన్న జీఎస్టీ 18 శాతానికి తగ్గిందని వివరించారు. సూపర్ జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు దాదాపు రూ. 8 వేల కోట్లు, జిల్లా ప్రజలకు రూ. 300 కోట్లు, ప్రతికుటుంబానికి నెలకు రూ. 6 వేలు నుంచి రూ. 12 వేల వరకు ఆదా అవుతుందని వివరించారు. సర్క్యులర్ ఎకానమీతో పాటు కుటుంబ ఆర్థిక సాధికారతకు ఈ సంస్కరణలు ఎంతో మేలుచేస్తాయన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఆర్టీవోలు ఆర్. ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లు వై. నాగేశ్వరరావు, వి.పద్మాకర్, అలీ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. ప్రియదర్శిని, కృష్ణాజిల్లా లారీ ఓనర్ల అసోసియేషన్, విజయవాడ టాక్సీ ఓనర్ల అసోసియేషన్, ఎన్ఏఎంటీఏ అసోసియేషన్, టీఎన్ టీయూసీ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బాబా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల బంగారు భవితకు బాసటగా నిలుద్దాం



## వివక్ష లేని వాతావరణంలో విద్య, సమాన అవకాశాల కల్పనకు కృషిచేద్దాం

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 16, మేజర్ న్యూస్ :** బాలికలకు సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు అందించడంతో పాటు వారు అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు సమష్టిగా కృషిచేద్దామని, వారి బంగారు భవితకు బాసటగా నిలుద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా వీటిలో విజేతలుగా నిలిచిన వారికి గురువారం కలెక్టరేట్లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. బాలికలకు శుభాకాంక్షలు తెలియజేసి.. బాగా చదువుకొని కెరీర్లో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి బాలికకు సమానత్వం, సరైన అవకాశాలు కల్పించడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. అత్యున్నత స్థానంలో ఉన్న గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళామణులను ఉదాహరిస్తూ ఇలాంటి గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఎదగాలని బాలికలకు సూచించారు. అదేవిధంగా వివక్ష, బాల్య వివాహాలు, హింస వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని, జిల్లా శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రజనీ కుమారి, డా. జె.ఇందుమతి, డాక్టర్ మాధవి, గైడ్ టీచర్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ ప్రారంభం



## చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం గూగుల్ ప్రాజెక్ట్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం బృందావన్ థియేటర్ సమీపం లోని టీడీపీ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు టీడీపీ నాయకులు - గూగుల్ డేటా సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలు వెల్లువెత్తాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ ను తీసుకురావడంపై మచిలీపట్నం టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బృందావన్ థియేటర్ సమీపంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో గురువారం పార్టీ నాయకులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షుడు లోగిశెట్టి స్వామి, సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మాజీ టౌన్ పార్టీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నాయకులు పి.వి. ఫణి కుమార్, పిప్పళ్ళ వెంకట కాంతారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గూగుల్ డేటా సెంటర్ రూపంలో చంద్రబాబు అందించిన వరం చరిత్రాత్మకమైంది.అమెరికా తర్వాత భారతదేశంలో రెండవ గూగుల్ డేటా సెంటర్ ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పడటం గర్వకారణం. 1.80 లక్షల కోట్ల పెట్టుబడులతో ఢిల్లీలో ఒప్పందాలు కుదిరాయి. దీని ద్వారా రాష్ట్రంలో సుమారు రెండు లక్షల ఉద్యోగాలు లభించనున్నాయి. గత ప్రభుత్వం చేసిన అప్పులను ఈ ప్రాజెక్ట్ ద్వారా వచ్చే ఆదాయం తీరుస్తుంది. పరిశ్రమల వాతావరణం పునరుద్ధరించబడిందని ఇది చంద్రబాబు సమర్థతకు నిదర్శనం, అని పేర్కొన్నారు. అలాగే గూగుల్ ప్రాజెక్ట్ సాధనలో కీలక పాత్ర పోషించిన నారా లోకేష్‌కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.టౌన్ టీడీపీ అధ్యక్షుడు లోగిశెట్టి స్వామి మాట్లాడుతూ,భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం ఎంతో గర్వకారణం.దీని ద్వారా రాష్ట్ర భవిష్యత్తు మరింత వెలుగులు నిండుతుంది అని అన్నారు.మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గూగుల్ డేటా సెంటర్‌ను వైజాగ్‌లో ఏర్పాటు చేయడం సంతోషకరం. దీనివల్ల నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి లభిస్తుంది. ఇక జగన్‌మోహన్ రెడ్డి మాత్రం కులమతాల మధ్య చిచ్చులు పెట్టడంలో తలమునకలై ఉన్నాడు. చదువుకున్న యువత రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచించాలి," అని వ్యాఖ్యానించారు. మాజీ టౌన్ పార్టీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా,నాయకుడు పిప్పళ్ళ వెంకట కాంతారావు మాట్లాడుతూ,గూగుల్ డేటా సెంటర్ రాష్ట్రానికి నూతన దశ ప్రారంభం.పరిశ్రమల పునరుజ్జీవనానికి ఇది ఆరంభ సంకేతం. చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లపాటి సుబ్రహ్మణ్యం, పి.వి. ఫణి కుమార్, తలారి రాంబాబు, కరెడ్ల సుశీల, వేముల బుజ్జి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా కేశినేని ఫౌండేషన్ డైరెక్టర్ కేశినేని వెంకట్ జన్మదిన వేడుకలు



### ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో సంబరాలు

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు, కేశినేని ఫౌండేషన్ డైరెక్టర్, టీడీపీ యువనాయకుడు కేశినేని వెంకట్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలు గురునానక్ కాలనీ లోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగాయి. టీడీపీ నాయకులు, మహిళ నాయకులు కేక్ కట్ చేసి కేశినేని వెంకట్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేశినేని ఫౌండేషన్ డైరెక్టర్ ఫౌండేషన్ ద్వారా పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్న కేశినేని వెంకట్ సేవానిరతిని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, తిరువూరు నియోజకవర్గ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాసరావు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సొలంకి రాజు, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, టీడీపీ నాయకులు మాదిగాని గురునాథం, టి.ఎన్.ఎస్.ఎఫ్ నాయకులు వడ్లమూడి వంశీ, అంగన్ వాడీ స్టేట్ మీడియా కో-ఆర్డినేటర్ చెరుకూరి మాధవి, విజయవాడ పార్లమెంట్ తెలుగు మహిళ నాయకురాలు నాగరత్నం, తెలుగు మహిళ నాయకురాలు గౌసియా బేగంలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# థాంక్స్ టూ నారా లోకేష్

### లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన టీడీపీ శ్రేణులు

### విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకువచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు

### తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం పట్టణంలో పంచాయతీ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నందుకు గాను తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,యువతీ, యువకులతో కలిసి థాంక్స్ టూ నారా లోకేష్ అంటూ నినాదాలు చేస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం లోకేష్ చిత్రపటానికి పాలభిషేకం చేసి భారీ కేక్ కటింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా ఇనుగం టి శోభన్ బాబు, లీల ప్రసాద్,లంక లితీష్, తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఈ గూగుల్ డేటా సెంటర్ విశాఖలో కార్యకలాపాలు ఆరంభిస్తే భారతదేశంలోనే ఎఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందుతుంద న్నారు. గత ఐదు సంవత్సరాలుగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏకంపె నీలు రావాలన్నా, పెట్టుబడులు పెట్టాలన్నా భయపడుతుంటే, ఐటి ఎలక్ట్రా నిక్స్ మంత్రి నారా లోకేష్ కృషితో, ఎంతో కష్టపడి కంపెనీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకొస్తున్నారని, కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టేస్తున్నారని, పెట్టుబడులు పెట్టే విషయంలో దిగ్గజ కంపెనీలు సైతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. గూగుల్ డేటా




సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా భవిష్యత్తులో యువతీ యువకులకు ఎన్నో సదవకాశాలు కలుగుతాయని అన్నారు.అవగాహన కలిగిన యువతీ యువకులు సైతం ఈ విజయోత్సవ ర్యాలీలో పాల్గొని, పంచాయతీ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి,భారీ కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ గూగుల్ డేటా సెంటర్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకువచ్చినందుకుగాను నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువతి యువకులు, తెలుగు యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమి చొరవతో గూగుల్ డేటా సెంటర్



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం చొరవతో మన రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ రావడం ఎంతో గర్వించదగ్గ విషయం అని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఫైజాన్ అన్నారు. ఏ కొండూరులో ఆయన మాట్లాడుతూ ప్రపంచం లోనే అతిపెద్ద కంపెనీ మన రాష్ట్రానికి తీసుకురావడానికి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు విశేష కృషి చేశారన్నారు. ఈ కంపెనీ రావడం వల్ల అభివృద్ధితోపాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. రాష్ట్రంలో గూగుల్ డేటా సెంటర్ వైజాగ్లో నెలకొల్పేందుకు కృషిచేసిన సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీలు చంద్రబాబు నాయుడు సీఎంగా ఉంటే ఏపీ వైపు చూస్తాయనిటానికి ఇదొక గొప్ప నిదర్శనం అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశారన్నారు. ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని గూగుల్ లాంటి సమస్త తో పాటు అనేక సంస్థలు రాష్ట్రానికి రానున్నాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లడం ఖాయమన్నారు.

### అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో

## ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో పౌర సేవలు

### విజయవాడను ఆధునిక సాంకేతికతతో అభివృద్ధి చేస్తాం

### విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో పౌర సేవలు భేష్ అని, విజయవాడను ఆధునిక సాంకేతికత తో అభివృద్ధి చేస్తాం అని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. అహ్మదాబాద్, గుజరాత్ లో అక్టోబర్ 15, 16 తేదీలలో నేషనల్ అర్బన్ కాన్క్లేవ్ అండ్ మెయరల్ సుమ్మిట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వారు నిర్వహించిన నేషనల్ అర్బన్ కాన్క్లేవ్ అండ్ మెయరల్ సుమ్మిట్- అక్టోబర్ 15, 16 తేదీలలో తాజ్ స్కైలాడ్, అహ్మదాబాద్ లో జరిగిందని, అందులో భాగంగా "షేపింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ సిటీస్" అనే సదస్సు నిర్వహించారని అన్నారు. ఈ సదస్సులో 110 కి పైగా నగరాల నుండి మేయర్లు, నాయకులు పాల్గొన్నారని, ఈ రెండు రోజుల్లో నగరానికి అవసరమయ్యే ఆధునిక సాంకేతికత కూడిన అభివృద్ధిని వారు తెలుసుకున్నారు అని తెలిపారు. అందులో భాగంగా సబర్మతి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్, అహ్మదాబాద్ బి ఆర్ టి ఎస్, మెట్రో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నగర పౌరులకు సేవలందించడం వంటివి తెలిపారు అన్నారు. అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వారి వేస్ట్ ఎనర్జీ ప్లాంట్, నర్సాపూర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను క్షేత్రస్థాయిలో చూపించి అందులో వారు చేసిన అభివృద్ధిని తెలిపారు అన్నారు. మాహా నగరంగా మారుతున్న విజయవాడకు ఇవి ఎంతో అవసరమని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రివర్ ఫ్రంట్, ఆధునిక సాంకేతికతతో కూడిన పౌర సేవలు విజయవాడను అభివృద్ధి పథం లో నడుపుతుందని తెలిపారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999